గెలుపోటములపై.. జోరుగా చర్చలు

- రిలాక్స్‌గా నాయకులు, కార్యకర్తలు
- పాతబస్తీలో పెరిగిన పోలింగ్ ఎవరి ఖాతాలోకి..?
- పోటీలో లేని బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు
- మజ్లిస్ వర్సెస్ బీజేపీగా పోలింగ్
- అందుబాటులో లేని అభ్యర్థులు.. నిరాశలో నాయకులు



ఓటింగ్ శాతం పెరగడంతో ఉత్కంఠ..

చార్మినార్: హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పోలింగ్ ముగియడంతో పాతబస్తీ నాయకులు, కార్యకర్తలు రిలాక్స్‌గా మారారు. హైదరాబాద్ నియోజకవర్గంలోని చార్మినార్, యాకుత్‌పురా, చాంద్రాయణగుట్ట, బహదూర్‌పురా తదితర శాసన సభ నియోజకవర్గాలకు చెందిన వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు తమ పార్టీ అభ్యర్థుల ఎన్నికల ప్రచారంలో పాల్గొని అలసిపోయారు. గత కొన్ని రోజులుగా మండే ఎండలను సైతం లెక్కచేయకుండా ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలకు మంగళవారం ఊరట లభించింది. ఎన్నికల ప్రచారం సందర్భంగా రోజు తెల్లవారు జామునే నిద్ర లేచి బస్తీల్లోకి వెళ్లిన వారందరూ కాస్త ఆలస్యంగా నిద్ర లేచి ఎన్నికల పోలింగ్ సరళిని పరిశీలించారు.

ఫోన్లు స్విచ్చాఫ్

కొంత మంది నాయకులు, కార్యకర్తలు తమ పార్టీలకు చెందిన అభ్యర్థులను కలిసేందుకు ప్రయత్నించారు. ఆయా పార్టీల అభ్యర్థులు అందుబాటులో లేకపోవడంతో నిరాశకు గురయ్యారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు అభ్యర్థుల ఫోన్‌లను స్విచ్చాఫ్ చేసుకున్నారని పాతబస్తీ నాయకులు మంగళవారం ఆవేదన వ్యక్తం చేశారు. మరికొంత మంది ద్వితీయ శ్రేణి నాయకులు తమ కార్యకర్తలు, నాయకులతో సమావేశమయ్యారు. పోలింగ్‌పై ఆరా తీశారు. ఏయే పార్టీకి ఎక్కడెక్కడ..ఎన్నెన్ని ఓట్లు పడ్డాయనే విషయాలపై చర్చించారు. ప్రధాన పార్టీల అభ్యర్థులు చాలా వరకు మంగళవారం సాయంత్రం వరకు సంబంధిత పార్టీ నాయకులు, కార్యకర్తలకు అందుబాటులోకి రాకపోవడంతో అసంతృప్తికి గురయ్యారు. మండే ఎండలను సైతం లెక్క చేయకుండా ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న తమను నిర్లక్ష్యం చేయడం సరైంది కాదని పలువురు పాతబస్తీ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు.

పెరిగిన పోలింగ్‌పై చర్చలు..

ఈసారి హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో పోలింగ్ శాతం పెరగడంపై పాతబస్తీలో చర్చనీయాంశమైంది. పాతబస్తీలోని నాలుగు శాసన సభ నియోజకవర్గాల్లో పోలింగ్ శాతం ఈసారి పెరిగింది. ఉదయం పోలింగ్ ప్రారంభమైనప్పటి నుంచి ముగిసేంత వరకు మందకొడిగా కొనసాగింది. ఎక్కడా అంతగా క్యూ లైన్లు కనిపించ లేదు. ఉదయమే కదా.. నెమ్మదిగా వస్తారు అని అనుకున్న నాయకులకు మధ్యాహ్నం గడుస్తున్నా.. ఓటర్ల రాక మొదలు కాలేదు. ఎండలున్నాయి కదా..అని అనుకున్న వారికి సాయంత్రం కూడా అలాగే ఉండడం.. ఐదు గంటల వరకు ఒకరిద్దరు ఓట్లు వేయడానికి రావడంతో తగ్గిన పోలింగ్ సరళిని పాతబస్తీ నాయకులు, కార్యకర్తలు చర్చించుకుంటున్నారు. అయితే సమయం ముగిసే కొద్ది సేపు లోపే పోలింగ్ అనూహ్యంగా పెరిగింది. 2009 ఎన్నికలతో పోల్చితే కొంత శాతం పోలింగ్ పెరిగింది. ఇలా పెరిగిన ఈ పోలింగ్ శాతం ఎవరికి అనుకూలంగా మారుతుందోనని లెక్కలు వేస్తున్నారు. పోలింగ్ ప్రశాంతంగా ముగియడంతో పాటు ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకపోవడంతో నాయకులు, కార్యకర్తలు ఊపిరి పీల్చుకుంటున్నారు. ఏదిఏమైనా ఫలితాల కోసం వచ్చే నెల 4వ తేదీ వరకు ఎదురు చూడక తప్పదంటున్నారు.

నాంపల్లిలో 45.37 శాతం పోలింగ్ నమోదు..

నాంపల్లి: సికింద్రాబాద్ పార్లమెంట్ స్థానం పరిధిలోని నాంపల్లి అసెంబ్లీ సెగ్మెంట్‌లో పోలింగ్ ముగిసే సమయానికి 45.37 శాతంగా నమోదయ్యింది. గత ఏడాది డిసెంబరులో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 46 శాతం పోలింగ్ అయింది. ఓటర్లలో చైతన్యం నింపేందుకు జీహెచ్ఎంసీ చేసిన ఫలితాలు ఫలించలేదు. గత ఫలితాలను దృష్టిలో ఉంచుకుని యూసీడీ విభాగం నియోజకవర్గం వ్యాప్తంగా ఎన్నో అవగాహన సదస్సులు, ర్యాలీలు చేపట్టింది. కానీ పోలింగ్ శాతాన్ని పెంచలేకపోయారు. అత్యధికంగా విద్యాధికులు, సాఫ్ట్‌వేర్‌లు, బడా వ్యాపారస్తులు ఓటు వేయడానికి దూరంగా ఉన్నారనే విమర్శ వినిపిస్తోంది.

గోషామహల్‌లో 54.72 శాతం పోలింగ్..

అబిడ్స్: గోషామహల్ అసెంబ్లీ నియోజకవర్గంలో 54.72 శాతం పోలింగ్ జరిగింది. నియోజకవర్గంలో 274572 లక్షల మంది ఓటర్లు ఉండగా అందులో 150207 లక్షల మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. సోమవారం రాత్రి వరకు జరిగిన పోలింగ్ శాతాన్ని రవికాంత్ ప్రకటించారు. గత ఐదు నెలల క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 57 శాతం పోలింగ్ జరగగా ఈ ఎన్నికల్లో 2శాతం పైగా పోలింగ్ తగ్గింది. హైదరాబాద్ పార్లమెంటులోని 7 నియోజకవర్గాల్లో గోషామహల్‌లోనే సోమవారం జరిగిన ఓటింగ్‌లో గోషామహల్‌లోనే అత్యధికంగా అయ్యింది.

పాతబస్తీ శాసనసభ నియోజకవర్గాల్లో పోలైన ఓట్లు..

- చార్మినార్ శాసనసభ నియోజకవర్గంలో 2,30,298 ఓటర్లుండగా.. ప్రస్తుతం 1,11,761 ఓట్లు పోలయ్యాయి. ఇందులో 59,818 పురుష ఓటర్లు కాగా.. 51936 ఓటర్లు మహిళా ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. చార్మినార్ నియోజకవర్గంలో మొత్తం 48.53 శాతం ఓట్లు పోలయ్యాయి.
- చాంద్రాయణగుట్టలో 3,49,611 మంది ఓటర్లుండగా.. 1,71,826 (49.15 శాతం) ఓట్లు పోలయ్యాయి.
- యాకుత్‌పురాలో 3,60,712 ఓటర్లుండగా.. ,56,341(43.34 శాతం) ఓట్లు పోలయ్యాయి.
- బహదూర్‌పురాలో 3,21,904 ఓటర్లుండగా.. 1,63,204(50.7శాతం) ఓట్లు పోలయ్యాయి.

గత ఎన్నికల్లో..

- చార్మినార్‌లో 2,06,658 ఓట్లకు గాను 95,063 ఓట్లు (46 శాతం) పోలయ్యాయి.
- యాకుత్‌పురాలో 328640 ఓట్లకు గాను 1,02,207 ఓట్లు (31.1 శాతం).
- చాంద్రాయణగుట్టలలో 2,96,904 ఓట్లకు గాను 1,15,496 ఓట్లు (38.9 శాతం)
- బహదూర్‌పురాలో 2,66,033 ఓట్లకు గాను 1,00,560 ఓట్లు (37.8 శాతం) పోలింగ్ నమోదైంది.

గోషామహల్ నియోజకవర్గంలో మిగతా నియోజకవర్గాల కంటే పోలింగ్ శాతం పెరగడం ఉత్కంఠంగా మారింది. నియోజకవర్గంలో ఓటింగ్ శాతం పెరగడంతో పార్లమెంటు ఎన్నికల ఫలితాలపై ఏమైనా ప్రభావం ఉంటుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. పలు పార్టీల నాయకులు లెక్కలు చేయడంలో మునిగిపోయారు.

ఆ ఓట్లు ఎవరి ఖాతాలోకి..?

- గత ఎన్నికల్లో నమోదైన పోలింగ్‌తో చూస్తే..ఈసారి కాస్త ఎక్కువగా ఓట్లు పోలయ్యాయి.
- ఈ పెరిగిన పోలింగ్ ఫలితం కచ్చితంగా మజ్లిస్ పార్టీ ఖాతాలోకి వెళుతుందని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు.
- అయితే ఈసారి బీజేపీ అభ్యర్థి మాధవీలతకు పాతబస్తీలో లభించిన ఆదరణ ఓట్ల రూపంలో ఆమె ఖాతాలోకి వెళుతుందా..లేదా..అనే విషయాలు రిజల్ట్ రోజు తేలనుంది.

ఎక్కడి నాయకులు అక్కడే గప్‌చుప్

గోల్కొండ: పార్లమెంట్ ఎన్నికలు ముగియడంతో వివిధ పార్టీల నాయకులు ఇళ్లు, కార్యాలయాలకే పరిమితమయ్యారు. గత నెల రోజులకు పైగా ఉదయం నుంచి సాయంత్రం వరకు సందడి చేసిన పార్టీల నాయకులు, వారి అనుచరులు ఎన్నికలు ముగియడంతో ఇంటి వద్దే ఉండిపోతున్నారు. బీజేపీ, మజ్లిస్ నాయకులు కార్వాన్ నియోజకవర్గంలో తమ పార్టీ అభ్యర్థులకు పడ్డ ఓట్ల వివరాలను లెక్క వేస్తూ బిజీబిజీగా ఉంటున్నారు. మజ్లిస్ ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ పార్టీ అభ్యర్థి ప్రచారంతో నామినేషన్ వేసిన రోజు నుంచి హోరెత్తించారు. ఆయన సైతం మంగళవారం తన ఇంటికే పరిమితమయ్యారు. తన అనుచరులతో కలిసి ఆయన కార్వాన్ నుంచి తమ పార్టీ అధ్యక్షుడికి వచ్చే ఓట్లను బేరిజు వేసుకుంటున్నారు. మరోవైపు బీజేపీ నాయకులు సైతం డివిజన్‌ల వారీగా లెక్కలు వేసుకుంటున్నారు. ఏదేమైనా గత రెండు నెలలుగా ఎన్నికల సందడి ముగియడంతో ప్రజలు సైతం ఊపిరి పీల్చుకుంటున్నారు.

స్ట్రాంగ్ రూమ్‌లో ఈవీఎం మిషన్లు

నాంపల్లి: పోలింగ్ ముగిసిన తర్వాత ఈవీఎంలను స్ట్రాంగ్ రూమ్‌కు తరలించారు. నాంపల్లి అసెంబ్లీ సెగ్మెంట్‌కు సంబంధించిన ఈవీఎంలను మాసబ్‌ట్యాంక్‌లోని జేఎన్టీయూ ఫైన్ ఆర్ట్స్ వర్సిటీలో ఏర్పాటు చేసిన (డీఆర్‌సీ) స్ట్రాంగ్‌రూమ్‌లో భద్రపరిచారు. సోమవారం రాత్రి 10 గంటల వరకు నియోజకవర్గంలోని 277 పోలింగ్ కేంద్రాలకు చెందిన ఈవీఎం మిషన్లు స్ట్రాంగ్ రూమ్‌కు చేరుకున్నాయి. ఈవీఎంలు స్ట్రాంగ్ రూమ్‌కు చేరడంతో పోలీసు బందోబస్తు డీఆర్‌సీ సెంటర్‌కు మారింది. ఓట్ల లెక్కింపు జూన్ 4న చేపడుతారు. ఓట్ల లెక్కింపునకు ఇంకా గడువు రెండు వారాలకు పైగా ఉంది. అప్పటి వరకు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు మూడంచెల భద్రతా చర్యలు చేపట్టడంతో పాటుగా నిరంతరం పహారా కాస్తున్నారు. స్ట్రాంగ్ రూమ్ వద్ద 24 గంటలు సాయుధ బలగాలతో పాటుగా నిత్యం సీసీ కెమెరాల ద్వారా నిఘాను ఏర్పాటు చేశారు.

అవార్డుల ప్రదానం

గన్‌ఫౌండ్రీ: జాతీయ యువజన అవార్డు గ్రహీత కండెరావు సుధారాణి ఇంటర్నేషనల్ బెస్ట్ మదర్స్ సర్వీసెస్ అవార్డును అందుకున్నారు. మంగళవారం బషీర్‌బాగ్‌లో మదర్ ఇండియా బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ సంస్థ ఆధ్వర్యంలో పలువురికి అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..తన సేవలను గుర్తించి అవార్డు ఇవ్వడం పట్ల సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ అవార్డు తనపై మరింత బాధ్యతను పెంచిందని రాబోయే రోజుల్లో మర్ని సేవా కార్యక్రమాలు చేస్తానని తెలిపారు. ఈ సమావేశంలో సంస్థ అధ్యక్షురాలు దాసరి స్వప్న మహేష్ తదితరులు పాల్గొన్నారు.

‘సైలెంట్‌గా మజ్లిస్ బోగస్ ఓట్లు’



కొడి మహేందర్

చార్మినార్: హైదరాబాద్ పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా జరిగిన పోలింగ్‌లో మజ్లిస్ పార్టీ సైలెంట్‌గా బోగస్ ఓట్లకు తెర తీశారని.. సంబంధిత అధికారులు వారికే వత్తాసు పలకడంతో చివరి నిమిషాల్లో పోలింగ్ శాతం పెరిగిందని బీజేపీ భాగ్యనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొడి మహేందర్ ఆవేదన వ్యక్తం చేశారు. తమ కళ్ల ముందే రియాసత్‌నగర్‌లోని పోలింగ్‌స్టేషన్ 40లో సమయం మించిపోయినప్పటికీ గేట్లు మూసి వేసి సైలెంట్‌గా మజ్లిస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు రిగ్గింగ్‌కు పాల్పడ్డారని ఆయన ఆరోపించారు. హైదరాబాద్ బీజేపీ అభ్యర్థి మాధవీలత సంతోష్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు సైతం చేసిందన్నారు. మజ్లిస్ పార్టీ నాయకులు బోగస్ ఓట్లు వేయడంలో సిద్ధహస్తులని.. ఈసారి సైలెంట్‌గా వారి పని చేసుకున్నారన్నారు. వేలాది ఓట్లను తొలగించిన సంబంధిత అధికారులు సకాలంలో ఓటరు స్లిప్పులను పంపిణీ చేయని కారణంగా పాతబస్తీలోని చాలా ప్రాంతాల్లో ఉన్న ఒక వర్గం ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోలేక పోయారన్నారు. ఓటర్ స్లిప్పులను పంపిణీ చేయని సంబంధిత జీహెచ్ఎంసీ అధికారులు, కిందిస్థాయి సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

మీరాలంమండి అమ్మవారి తీర్థ ప్రసాదాల అందజేత



చార్మినార్: టీఎస్ బసవ కేంద్రం వ్యవస్థాపక అధ్యక్షుడు నాగ్‌నాథ్ మాశెట్టి కుమారుడైన రాజేష్ సరిత దంపతుల 25వ వివాహ వార్షికోత్సవ వేడుకలకు హాజరైన మీరాలంమండి మహంకాళేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య శాలువా కప్పి పూల మాలలతో ఘనంగా సత్కరించారు. ఆయురారోగ్యాలతో పాటు అష్టైశ్వర్యాలు కలిగి ఉండాలని కోరుతూ మీరాలంమండి తీర్థ ప్రసాదాలను దంపతులకు అందజేసినట్లు గాజుల అంజయ్య తెలిపారు.

పారా సైక్లింగ్ టీమ్ కోచ్‌గా దత్తాత్రేయ



చార్మినార్: ఈనెల 16 నుంచి 19వ తేదీ వరకు ఇటలీలో జరుగనున్న పారా వరల్డ్ కప్-2 పోటీల కోసం ఇండియన్ సైక్లింగ్ (పారా) టీమ్ కోచ్‌గా.. మేనేజర్‌గా తెలంగాణ సైక్లింగ్ అసోసియేషన్ కార్యనిర్వాహక కార్యదర్శిగా పాతబస్తీకి చెందిన కె.దత్తాత్రేయ నియమితులయ్యారు. రాబోయే పారా ఒలింపిక్ గేమ్స్-2024 కోసం భారత్ తరఫున టీం నాణ్యమైన ఆట ప్రదర్శనను అందించి దేశానికి కీర్తి ప్రతిష్టలు అందించనున్నామని ఆయన దీమా వ్యక్తం చేశారు.

రెండోసారి ఓటు వేసేందుకు వచ్చిన మహిళపై కేసు

సంతోష్‌నగర్: పార్లమెంటు ఎన్నికల సందర్భంగా సోమవారం రెండోసారి ఓటు వేయడానికి వచ్చిన ఓ మహిళపై సంతోష్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ పి.రఘువీర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పార్లమెంటు ఎన్నికలను పురస్కరించుకొని సోమవారం యాకుత్‌పురా నియోజకవర్గం కళందర్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన 111/68 పోలింగ్ బూత్‌లో ఓ మహిళ తన ఓటు హక్కును వినియోగించుకుంది. అనంతరం రెండోసారి కూడా అదే మహిళ ఓటు వేయడానికి వచ్చింది. దీనిపై ప్రొసిడింగ్ అధికారి సయ్యద్ ఫాతిమా సంతోష్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

జన సంఘ్ కార్యకర్తకు దత్తాత్రేయ ప్రశంసలు



జన సంఘ్ కార్యకర్త ఓంకార్‌ను అభినందించిన బండారు దత్తాత్రేయ

అబిడ్స్: వయస్సుకు సంబంధం లేకుండా వృద్ధాప్యంలో కూడా జన సంఘ్ కార్యకర్త ఓంకార్ (82) ఎన్నికల పోలింగ్ పెంచేందుకు ఎంతో కృషి చేసినందుకు హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ ఆయనను అభినందించారు. గౌలిగూడలో చిన్నప్పుడు తన వెంట ఉంటూ 82 ఏళ్ల వయసులో కూడా ఓంకార్ పోలింగ్ శాతాన్ని పెంచేందుకు గౌలిగూడ పరిసరాల్లో ఇంటింటా తిరుగుతూ ఓటు వేయాలని ఎంతో కృషి చేశారని దత్తాత్రేయ అన్నారు. 60 ఏళ్లుగా సమాజంపై నిబద్ధతతో, తపనతో ప్రతి ఎన్నికల్లో ఓంకార్ ఓటర్లకు అవగాహన కల్పించడం, ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు ఎంతో కృషి చేస్తున్నారన్నారు. ఓంకార్ లాంటి వ్యక్తిని సమాజం ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అందరు ఓటు వేయాలని, ఓటు హక్కు ఎంతో విలువైందని ఓంకార్ నుంచి యువత కూడా ఎంతో నేర్చుకోవాల్సి ఉందన్నారు.

‘రాష్ట్రంలో మాకే విజయావకాశాలు’



రాజేష్ కుమార్

చార్మినార్: ఈ పార్లమెంట్ ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థులు ఎక్కువ స్థానాల్లో విజయం సాధించనున్నారని కాంగ్రెస్ పార్టీ బహదూర్‌పురా నియోజకవర్గం ఇన్‌చార్జి పులిపాటి రాజేష్‌కుమార్ అన్నారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ..సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలోని తమ ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేస్తున్న ఆరు గ్యారంటీలు అన్ని వర్గాల ఓటర్లకు మేలు జరుగుతోందని..అందుకే ఈ పార్లమెంట్ ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థులకు అధికంగా ఓట్లు వేసి గెలిపిస్తున్నారన్నారు. ముస్లిం మైనార్టీ ఓటర్లు తమ పార్టీ అభ్యర్థులకే ఓటు వేశారన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



దూద్‌బౌలి: నయాపూల్‌లోని నయాబ్ హోటల్ ఎదురుగా ఉన్న ఓయో లాడ్జింగ్ వద్ద మంగళవారం ఉదయం 10:30 గంటలకు 40-45 ఏళ్ల వయస్సు గల గుర్తుతెలియని వ్యక్తి మృత దేహాన్ని గుర్తించి పోస్టు మార్టం కోసం ఉస్మానియా ఆసుపత్రికి తరలించినట్లు చార్మినార్ ఇన్‌స్పెక్టర్ కమతం చంద్రశేఖర్ తెలిపారు. బ్లాక్ కలర్ టీ-షర్ట్, బ్లూ కలర్ జీన్స్ ప్యాంట్ వేసుకున్న ఇతను 5.2 అడుగుల ఎత్తు ఉంటాడని.. అతనికి సంబంధించిన వారెవరైనా ఉంటే తమను సంప్రదించాలని ఆయన కోరారు.

‘అమ్మ చెక్కిన శిల్పం’ పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఏనుగు నర్సింహారెడ్డి

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో పాలపిట్ట బుక్స్ ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత జాలాదిరత్న సుధీర్ రచించిన ‘అమ్మ చెక్కిన శిల్పం’పుస్తకావిష్కరణ సభ మంగళవారం రవీంద్ర భారతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ కవి ఏనుగు నర్సింహారెడ్డి మాట్లాడుతూ..మాతృభాష దినోత్సవాన్ని పురస్కరించుకుని రచయిత రాసిన ఈ పుస్తకాన్ని పాఠ్యాంశంలో పెట్టదగ్గ గ్రంథమని కొనియాడారు. మాతృమూర్తుల ఔనత్యాన్ని తెలిపే ఈ పుస్తకాన్ని ప్రతి విద్యార్థిచేత చదివించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కథా రచయిత సీహెచ్. రాంబాబు, అనువాదకులు డాక్టర్ లక్ష్మణాచారులు తదితరులు పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ

గన్‌ఫౌండ్రీ: సుమారు 20 ఏళ్ల క్రితం తెలుగు భాషలో కల్పిత ఊహాజనిత కథలు తప్పా బౌద్ధం గురించి వాస్తవాలు అందుబాటులో లేవని, నేడు సాధికార బౌద్ధ సాహిత్యం తెలుగులోకి రావడం ఎంతో అభినందనీయమని విశ్రాంత ఐపీఎస్ అధికారి సి.ఆంజనేయరెడ్డి అన్నారు. మంగళవారం రవీంద్రభారతిలో లతారాజ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బౌద్ధ సాహిత్యంపై 10 రచనలతో పాటు ఇతర 4 సామాజిక సాహిత్య సంపుటిల ఆవిష్కరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఈ సాహిత్య పుస్తకాలు ప్రచురణలోకి రావడానికి కె.కె.రాజ కృషిని అభినందించారు. ఈ సమావేశంలో ప్రముఖ సాయిత్య, రచయితలు మల్లేపల్లి లక్ష్మయ్య, జయరాజ్, ఈమణి శివనాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఆంజనేయరెడ్డి తదితరులు

అక్రమ పార్కింగ్‌లతో అవస్థలు



షేక్‌పేట్ అల్‌హమ్రా కాలనీ వద్ద రోడ్డు పక్కన అక్రమ పార్కింగ్

గోల్కొండ: అక్రమ పార్కింగ్‌లకు అడ్డూ అదుపు లేకుండాపోతుంది. ప్రధాన కూడళ్లతో పాటు రహదారులపై ద్విచక్ర వాహనాలతో పాటు ఆటోలు, కార్లు సైతం అడ్డదిడ్డంగా రోడ్లపై పార్కు చేసి ఉంటున్నాయి. మెహిదీపట్నం మెరాజ్ చౌరస్తా, ఆసిఫ్‌నగర్‌లోని హసన్ కేఫ్‌ల వద్ద రోడ్లపైనే ద్విచక్ర వాహనాలు గంటల తరబడి పార్కు చేసి ఉంటున్నాయి. మెరాజ్ కేఫ్ చౌరస్తా వద్ద ఆటోలు ఓవైపు, ద్విచక్ర వాహనాలు ఓవైపు పార్కు చేసి ఉంటున్నాయి. దీంతో ఆ చౌరస్తా వద్ద ట్రాఫిక్ జామ్ ఏర్పడుతుంది. టోలిచౌకీ చౌరస్తా వద్ద గల రుమాన్ కేఫ్, రాయల్ కిరాణాషాప్‌ల ముందు ఆటోలు, ద్విచక్ర వాహనాలు నిలిచి ఉంటున్నాయి. దీంతో గచ్చిబౌలి వైపు నుంచి మెహిదీపట్నం వైపు వెళ్లే బస్సులు టోలిచౌకీ స్టాప్ వద్ద ఆగకుండా ఫ్లైఓవర్‌పై నుంచి వెళ్తున్నాయి. అదే విధంగా షేక్‌పేట్ డీమార్ట్, అల్‌హమ్రా కాలనీ తదితర ప్రాంతాల్లో సైతం రోడ్డుపై అక్రమ పార్కింగ్ జోరుగా సాగుతున్నాయి. రోడ్లపై అక్రమ పార్కింగ్‌లో ప్రతినిత్యం ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడడంతో పాటు తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ట్రాఫిక్ పోలీసులు అక్రమ పార్కింగ్‌లకు అడ్డుకట్ట వేయాలని పలువురు కోరుతున్నారు.

ప్లే గ్రౌండ్‌లలో పిల్లల సందడి



గోల్కొండ ప్లే గ్రౌండ్‌లో..

గోల్కొండ: స్కూల్స్, కళాశాలలకు సెలవులు కావడంతో ప్లే గ్రౌండ్‌లలో ఆటలు ఆడుకుంటూ పిల్లలు సందడి చేస్తున్నారు. ఎన్నికల హడావిడి కూడా ముగియడంతో కాలేజీ విద్యార్థులు సైతం ప్లే గ్రౌండ్ బాట పట్టారు. పిల్లల ఆటలతో మాసాబ్‌ట్యాంక్‌లోని హాకీ గ్రౌండ్, అహ్మద్ నగర్‌లోని ఈద్గా గ్రౌండ్, గోల్కొండ రిసాలబజార్‌లోని ఒవైసీ ప్లే గ్రౌండ్, బల్దియా ప్లే గ్రౌండ్‌లలో ఉదయం నుంచి సాయంత్రం వరకు పిల్లలు ఆటలు ఆడుతున్నారు. మరోవైపు గోల్కొండలోని బల్దియా స్విమ్మింగ్ పూల్, విజయనగర్ కాలనీలోని స్విమ్మింగ్ పూల్స్‌లో పిల్లలు ఈతకొడుతూ సరదా పడుతున్నారు. క్రికెట్‌తో పాటు ఫుట్‌బాల్ ఆడుతూ కాలక్షేపం చేస్తున్నారు.

ఘనంగా నల్లపోచమ్మ ఆలయ వార్షికోత్సవాలు



జియాగూడ: సంజయ్‌నగర్‌లోని నల్లపోచమ్మ తుల్జాభవాని ఆలయ వార్షికోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. మంగళవారం గణపతి పూజ, కర్మనా పుణ్యావచనం, మండల పూజ, దుర్గాసూక్తి పారాయణం, మహా లింగార్చన శ్రీ చక్రార్చన, సాయంత్రం లక్ష్మీగణపతి పూజ, నవగ్రహ నక్షత్ర దుర్గాసహిత ఆలయ దేవత హోమాలు, జయాది హోమాలు, నీరాజనం, మంత్ర పుష్పములు, తీర్థ ప్రసాద కార్యక్రమాలు నిర్వహించినట్లు ఆలయ ప్రతినిధి రావుల శ్రీనివాస్ తెలిపారు. 15వ తేదీ బుధవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు, సాయంత్రం మాతేశ్వరీల ఊరేగింపు ఆలయ పుర వీధుల్లో నిర్వహిస్తారు. 16న గురువారం మధ్యాహ్నం అఖండ హారతి, మహా అన్నదాన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు.

ఎక్కడి చెత్త అక్కడే..

- ఖాజిపురాలో పేరుకుపోతున్న చెత్తా చెదారం
- ఇబ్బందులు పడుతున్న స్థానికులు
- నిర్లక్ష్యం వహిస్తున్న జీహెచ్ఎంసీ సిబ్బంది



ఖాజిపురా ఆశా టాకీస్ సమీపంలోని చెత్తా చెదారంలో మేకలు

శాలిబండ: బస్తీలు, కాలనీలు, రోడ్లలోని చెత్తకుప్పలు, వ్యర్థాలను జీహెచ్ఎంసీ సిబ్బంది ఎప్పటికప్పుడు తొలగించకపోవడంతో మూగ జీవాలకు ప్రాణాంతకరంగా మారాయి. శాలిబండ డివిజన్ ఖాజిపురా ఆశా టాకీస్ సమీపంలో జీహెచ్ఎంసీ సిబ్బంది గత మూడు రోజులుగా చెత్తాచెదారాలను తొలగించకపోవడంతో తీవ్ర దుర్గంధంగా మారింది. దీంతో ఈ దారిలో రాకపోకలు సాగించలేకపోతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానికంగా వ్యాపారాలు నిర్వహించే వారు సైతం దుర్గంధం కారణంగా తమ వ్యాపారాలు సరిగ్గా జరగడం లేదని వాపోతున్నారు. దీనిపై సంబంధిత సూపర్‌వైజర్, అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేసినా..ఎలాంటి ఫలితం లేకుండా పోయిందని ప్రజలు వాపోతున్నారు. ఈ చెత్తా చెదారం పక్కనే విద్యుత్ వైర్లు వేలాడుతుండటంతో చెత్తా చెదారానికి వచ్చే ఆవులు, మేకలు, ఇతర జంతువులు ఆహారం కోసం వచ్చి ప్రమాదాలకు గురయ్యే అవకాశముందని స్థానికులు వాపోతున్నారు. చెత్తాచెదారాలను తింటూ మూగ జీవాలు అనారోగ్యం పాలవుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వెంటనే చెత్తను తొలగించాలి



చెత్త పేరుకుపోవడంతో ఆవులు, మేకలు, ఇతర జంతువుల ఆహారం కోసం వస్తున్నాయి. దీంతో వ్యర్థాలు రోడ్డుపై వ్యాపిస్తున్నాయి. చెత్తా చెదారం తిని మూగజీవాలు అనారోగ్యం పాలవుతున్నాయి. అధికారులకు పలుమార్లు చెప్పినా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైన అధికారులు స్పందించి చెత్త తొలగింపునకు చర్యలు తీసుకోవాలి.

– మహమ్మద్ అన్వర్ అలీ, టైలర్, ఆశా టాకీస్

రాకపోకలు సాగించలేకపోతున్నాం



ఈ ప్రాంతంలో రెండు, మూడు రోజులుగా చెత్తాచెదారాన్ని తొలగించడం లేదు. దీంతో స్థానికంగా తీవ్ర దుర్వాసన వెదజల్లుతోంది. ఈ దారిలో రాకపోకలు సాగించలేకపోతున్నాం. చెత్తా చెదారం కారణంగా ప్రజలు అనారోగ్యానికి గురికాక ముందే సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలి.

– మహమ్మద్ జాకీర్, ఖాజిపురా